మాతాశిశు సంరక్షణ ధ్యేయంగా..

- పకడ్బందీగా పీఎంఎస్ఎంఏ అమలు
- హైరిస్క్ గర్భిణుల గుర్తింపు
- ప్రసవానికి నాలుగు రోజుల ముందే ఆసుపత్రులకు తరలింపు
- 555 గర్భిణుల్లో 128 హైరిస్క్ కేసులు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: మాతాశిశు రక్షణ ధ్యేయంగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యి పూర్తి ఆరోగ్యవంతురాలయ్యే వరకూ తల్లీబిడ్డల రక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ)ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోంది. ప్రతి నెలా గర్భిణులకు ఆసుపత్రుల్లో పరీక్షించడంతో పాటు వారిలో హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తిస్తున్నారు. అలా గుర్తించిన వారిని ప్రసవానికి నాలుగు రోజులు ముందే బోధనాసుపత్రికి కానీ, జిల్లా, ఏరియా ఆసుపత్రులకు గానీ తరలించి మెరుగైన రక్షణ చర్యలు చేపడతారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించడం ఇలా...

గర్భిణిలో రక్తహీనత, చిన్న వయసులో గర్భం దాల్చడం, ఎక్కువ కాన్పులు, అధిక బీపీ, గుండె, కిడ్నీ జబ్బులు, ఇతర సమస్యలతో గర్భం దాల్చిన మహిళలను హైరిస్క్ కేసులుగా పరిగణిస్తారు. అలాంటి గర్భిణుల వివరాలను ఏఎన్ఎం ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తుంది. ఏ ఆసుపత్రికి తరలించారో నిర్ణయించి తగిన ఏర్పాట్లను ఉచితంగా చేస్తారు.

మండలాల వారీగా గర్భిణులు ఇలా...

కపిలేశ్వరపురం మండలంలో 53,500 మంది జనాభా గల మూడు పీహెచ్‌సీలలో 103 మంది గర్భిణులు గత నెల జనవరిలో పరీక్షలు చేయించుకున్నారు. కాగా వారిలో 41 మందిని హైరిస్క్ గల వారిగా గుర్తించారు. 67,688 జనాభా గల మండపేట మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 46 మంది గర్భిణులను పరీక్షించగా 12 మందిని హైరిస్కగలవారిగా గుర్తించారు. 74,962 జనాభా గల రాయవరం మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 104 మంది గర్భిణులను పరీక్షించగా 11 మందిని హైరిస్కగల వారిగా గుర్తించారు. 59,415 జనాభా గల కాజులూరు మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 92 మంది గర్భిణులను పరీక్షించగా 24 మందిని హైరిస్కగలవారిగా గుర్తించారు. 55,452 జనాభా గల రామచంద్రపురం మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 67 మంది గర్భిణులను పరీక్షించగా 11 మందిని హైరిస్కగలవారిగా గుర్తించారు. 76,118 జనాభా గల కె.గంగవరం మండలంలోని ఐదు పీహెచ్‌సీలలో 143 మంది గర్భిణులను పరీక్షించగా 29 మందిని హైరిస్కగలవారిగా గుర్తించారు.

సాధారణ ప్రసవాలకూ ప్రోత్సాహం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరుపుకున్న బాలింతలకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుంది. సాధారణ ప్రసవానికి రూ.4,000, సిజేరియన్ ప్రసవానికి రూ.3,000 ఇవ్వడంతో పాటు వారందరికీ పోషకాహారాన్ని సమకూర్చుకునేందుకు అదనంగా రూ.1000 అందజేస్తోంది.

క్రమం తప్పకుండా పరీక్షలు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా గర్భిణులను పరీక్షిస్తున్నాం. నిర్దేశించిన ప్రామాణికాలు మేరకు రిస్కను గుర్తిస్తే వెంటనే మెరుగైన పరీక్షలు కోసం అధునాతన సదుపాయాలు గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నాం. తల్లీ, బిడ్డల సంరక్షణే ధ్యేయంగా వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల సిబ్బంది శ్రమిస్తున్నారు.

–పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

రెండు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల్లో హైరిస్క్ కేసుల గుర్తింపు ఇలా...

పీహెచ్‌సీ	జనాభా పరిధి	గర్భిణులు	హైరిస్క్‌గా గుర్తించిన గర్భిణులు
అంగర	20,175	26	06
వాకతిప్ప	16,216	25	07
అచ్యుతాపురం	17,109	52	28
ద్వారపూడి	44,904	29	06
కేశవరం	22,784	17	06
రాయవరం	26,390	58	08
మాచవరం	19,000	46	03
గొల్లపాలెం	29,572	42	13
దుగ్గుదూరు	29,843	50	11
ద్రాక్షారామ	32,000	35	05
వెల్ల	23,452	32	06
పామర్రు	21,300	38	08
దంగేరు	16,236	26	07
శేరిలంక	1,200	06	--
పేకేరు	17,130	28	12
కుందూరు	20,252	45	02
మొత్తం	3,87,135	555	128

క్లుప్తంగా

ఫేసియల్ గుర్తింపు నుంచి మినహాయించాలి

కపిలేశ్వరపురం: తమ హాజరును ముఖ ఆధారిత యాప్ ద్వారా నమోదు చేయడం నుంచి తమను మినహాయించాలని కోరుతూ మండలంలోని వీఆర్‌ఏలు మంగళవారం తహసీల్దార్ కొమరం సూర్యారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా కార్యదర్శి పలివెల సత్యనారాయణ, నాయకులు పలివెల నాగేశ్వరరావు, అదపాక శివ ప్రసాద్‌లు తమ సమస్యలను తహసీల్దార్ కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లు శ్రీనివాసరావు, సాకా వీర్రాజు, ముమ్మిడివరపు జానకిబాబు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మండపేట విద్యార్థి ప్రతిభ



గుణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు

మండపేట: సూరంపాలెం ఆదిత్య కళాశాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌బజ్ పోటీలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఎస్సీ సెకండియర్ విద్యార్థి ఉద్దండి గుణ ప్రతిభ కనబరిచి మొదటిస్థానం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో గుణను ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

మాణిక్యం సేవలు అభినందనీయం



డాక్టర్ మాణిక్యంను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని పామర్రు పీహెచ్‌సీ వైద్యుడు టి.మాణిక్యం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. రిపబ్లిక్ డే పురస్కరించుకుని డాక్టర్ మాణిక్యం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవాపురస్కారం అందుకున్న సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు మంచి వైద్యం అందిస్తూ అండగా నిలుస్తున్న డాక్టర్ మాణిక్యంను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి దంపతులు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, మండల సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

రాయవరం: భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు చంపుతానని బెదిరిస్తున్నట్లుగా భార్య ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కూర్మాపురానికి చెందిన తేజసుధకు మండపేట మండలం అర్తమూరుకు చెందిన కర్రి వెంకటరెడ్డితో 2018 ఫిబ్రవరిలో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు కలిగారు. కొన్ని నెలల పాటు వెంకటరెడ్డి భార్య తేజసుధను బాగానే చూసుకున్నాడు. అనంతరం వెంకటరెడ్డి, అతని తల్లి పద్మ, చెల్లెలు జ్యోతి ప్రోద్బలంతో భార్య తేజసుధను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటుగా, చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ మేరకు తేజసుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

గర్భిణుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు



హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ సుమలత

ఆలమూరు: గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య రక్షణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ ఎడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెద పళ్లలోని పీహెచ్‌సీని సందర్శించి వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 13 పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. తల్లి, బిడ్డ రక్షణే ధ్యేయంగా గర్భం దాల్చిన నాటి నుంచి ఆ మహిళ ఆరోగ్య రక్షణ ఆరోగ్య సిబ్బంది తీసుకుంటారన్నారు. అలాగే గర్భిణులకు సంబంధించి హైరిస్కలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, చిన్నారులకు అందిస్తున్న టీకాల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, ఫార్మాసిస్టు సుగుణ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ఎల్‌టీ రమేష్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనతో బాలికలకు బంగారు భవిత



లబ్ధిదారులకు అకౌంట్ పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: తపాల శాఖ నిర్వహిస్తున్న సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల బంగారు భవితకు బాటలు వేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. ఈ పథకం ప్రయోజనాలు వివరిస్తూ మంగళవారం స్థానిక 20వ వార్డులో మండపేట హెడ్ పోస్టాఫీసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 10 ఏళ్లలోపు ఈ పథకం గొప్ప వరమని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టల్ ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ 15 ఏళ్లపాటు నెలకు రూ. 250 నుంచి పొదుపు చేసుకోవచ్చునని, 21 ఏళ్ల వయస్సులో పొదుపు సొమ్మును వడ్డీతో తిరిగి చెల్లిస్తారన్నారు. అవసరమైతే 18 ఏళ్ల వయస్సులో ఉన్నత చదువుల కోసం 50 శాతం సొమ్మును పొందవచ్చన్నారు. అనంతరం సుకన్య సమృద్ధి యోజన ఖాతా పత్రాలను లబ్ధిదారులకు చైర్‌పర్సన్ దుర్గారాణి అందజేశారు. పోస్టుమాస్టర్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టపా పుల్లేశ్వరరావు, పోస్టల్ ఉద్యోగులు ఎండీఎం షరీఫ్, కె. ఈశ్వరరావు, శ్రీనివాస్, సీహెచ్ దుర్గాదేవి, అనూష, ఎ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు వివరిస్తున్న సీఐ శివగణేష్, ఎస్ఐ అప్పారావు

మండపేట: యువత భవిష్యత్తును ఛిద్రం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు పోలీసు శాఖ కృషి చేస్తోందని పట్టణ సీఐ పి. శివగణేష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఐ శివగణేష్, ఎస్ఐ కె.అప్పారావు మంగళవారం స్థానిక విజ్ఞాన్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డ్రగ్స్ వలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా తమ దృష్టికి తీసుకు రావాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు



ఆర్యావటంలో మహిళా పోలీసు ఇంట్లో బీరువా కొల్లగొట్టి చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

కాజులూరు: గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్నాయి. మంగళవారం మండలంలోని ఆర్యావటంలో రెండుచోట్ల, గొల్లపాలెంలో ఒక చోట దొంగలు చోరీకి పాల్పడి విలువైన వస్తువులు దొంగిలించుకుపోయారు. కాజులూరుకి చెందిన ఒక మహిళా పోలీసు ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోనికి వెళితే కాజులూరు–1 సచివాలయంలో పనిచేసే కె.బామరాజు ఆర్యావటం కోళ్ల తూము సెంటరులో నివాసముంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆమె ఇంటిలో చోరీకి పాల్పడి విలువైన వస్తువులు దొంగిలించుకుపోయారు. అలాగే సమీపాన ఉన్న దంగేటి శివన్నారాయణ పాన్ షాపులో చొరబడి గల్లా పెట్టెలోని నగదు, కొన్ని విలువైన సరకులు దొంగిలించారు. గొల్లపాలెంలోని అంజనీపుత్ర పాన్ షాపులోనూ ప్రవేశించి గల్లా పగులగొట్టి కొంత నగదు, విలువైన సరుకులు పట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ తమ సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాకినాడ నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి నిందితుల వేలిముద్రలను గుర్తించారు. మూడుచోట్ల సుమారుగా రూ.10 లక్షల వరకూ చోరీ జరిగినట్టు బాధితులు చెబుతున్నారు. కాగా జరిగిన సంఘటనలపై పూర్తి వివరాలు తెలియజేసేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉంటున్నారనే నెపంతో గ్రామాల్లో రాత్రిపూట పోలీసులు గస్తీలు తిరగకపోవటంతో దొంగతనాలు ఎక్కువగా జరుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. పుల్లాన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు డాక్టర్ సాయి పవన్, కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు వైద్య సేవలు అందించారు. వివిధ వ్యాధుల గుర్తింపునకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు



విద్యుత్ సబ్‌స్టేషన్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

రాయవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లగా చేసుకుని పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని సోమేశ్వరంలో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి పనుల భూమిపూజ, ప్రారంభోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనబడి నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక వంటి పలు సంక్షేమ పథకాలు దేశం మొత్తానికి దిక్సూచిగా నిలుస్తున్నాయన్నారు. అంతకు ముందుగా ఆయన రూ.2.68 కోట్ల వ్యయంతో నిర్మించే 33/11 కేవీఏ విద్యుత్తు సబ్ స్టేషన్‌కు భూమిపూజ చేశారు. అలాగే రూ.1.22 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, రూ.47లక్షలతో నిర్మించిన సోమగుండం చెరువు అభివృద్ధి పనులు, రూ.26 లక్షలతో చేపట్టిన రుద్రభూమి అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడనూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కాలా అప్పారావు, ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఈపీడీపీసీఎల్ ఎస్ఈ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ డి.శ్రీధర్‌వర్మ, ఏడీఈ పి.సన్యాసిరావు, కన్‌స్ట్రక్షన్ ఈఈ వై.డేవిడ్, డిప్యూటీ ఈఈ టీవీ శివరామకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

మండపేట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీఓ రాజు సూచించారు. ఇళ్ల నిర్మాణం, అసంఘటిత కార్మికులకు బీమా, విద్యార్థుల డ్రాపవుట్స్ తదితర అంశాలపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.35,000 రుణసాయం అందేలా చూడాలన్నారు. లేబర్ ఆఫీసర్ పద్మావతి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, ఉపాధి కూలీలకు ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. ఇందుకోసం రూ.50 దరఖాస్తు రుసుముతో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఎంఈఓ ఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి స్కూల్ పరిధిలో బడి బయట పిల్లలను గుర్తించి వివరాలు అందజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేత ధూళిపూడి ఆకస్మిక మృతి



ధూళిపూడి వెంకటేశ్వరరావు(ఫైల్)

రాయవరం: సోమేశ్వరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ధూళిపూడి వెంకటేశ్వరరావు (58) మంగళవారం గుండె పోటుతో మృతి చెందాడు. పార్టీలోని ముఖ్య నాయకులందరికీ ఆయన 'ఢీ'గా సుపరిచితుడు. దివంగత మాజీ సర్పంచ్ నిమ్మకాయల దోసారావు, ప్రస్తుత సర్పంచ్ ఆరిఫ్ విజయంలో 'ఢీ' కీలకపాత్ర పోషించారు. వెంకటేశ్వరరావు మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సర్పంచ్ ఆరిఫ్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు కాలా అప్పారావు, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, పలువురు స్థానిక నేతలు ధూళిపూడి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది

రామచంద్రపురం: సీఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఏపీ కొబ్బరి దింపు కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు నేతృత్వంలో కొబ్బరి దింపు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మంత్రి స్వగృహం వద్ద మంగళవారం వినతిపత్రం అందజేశారు. రిజిస్టర్ కాబడిన 111 గ్రామ సంఘాల్లో 7531 మంది కొబ్బరి దింపు కార్మికులున్నారని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు ఫించన్ ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు మంత్రి వేణుకు విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ కొబ్బరి దింపు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర సభ్యులు సిర్రా శ్రీనివాసరావు, గుబ్బల కృష్ణ, జంగ నాగేశ్వరరావు, ఉంగరాల దుర్గాప్రసాద్, కంచి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమమే సీఎం లక్ష్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- శీల గ్రామంలో గడప గడపకూ..



శీల గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



ఏడిదలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని శీలలో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనం వెంకటసుబ్బారావు తదితరులు మంగళవారం గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారిల ఆధ్వర్యంలో వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. వృద్ధులతో పింఛన్ అందుతుందా అని, విద్యార్థులను అమ్మఒడి, విద్యాదీవెన అందుతుందా అని అడుగుతూ అద్దె ఇళ్లల్లో ఉన్నవారిని ఇంటి స్థలం మంజూరయిందా అని తెలుసుకున్నారు. సంక్షేమాన్ని ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని మరలా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, యాళ్ల సత్తిబాబు, దొమ్మేటి కొండ, మాత నూకరావు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

మండపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా క్షేత్ర స్థాయిలో అర్హులైన ప్రతి ఇంటికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందజేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఏడిదలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం 1వ వార్డు నుంచి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? ఏమైనా సమస్యలున్నాయా? అంటూ గ్రామస్తులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ ఐ రాజు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజుకు ఆదేశాలిచ్చారు. తొలుత బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డప్పులతో ఎమ్మెల్సీ తోటకు పార్టీ శ్రేణులు, ఏడిద ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఎడ్ల బండిపై ఆయనను గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, గొలుగూరి సందీప్‌రెడ్డి, తాతపూడి రాజేష్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే ప్రారంభం

ఏడిదలో రూ. 23.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఆర్‌బీకే మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండల కమిటీ చైర్మన్లు అన్నందేవుల చంద్రరావు, పుట్టా కృష్ణమూర్తి, డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, ఏఓ బి ఏసుబాబు, రైతులు పాల్గొన్నారు.